క్లుప్తంగా

పొలం గట్లపై మొక్కల పెంపకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

పెళ్లకూరు: ఉపాధి హామీ పథకం కింద రైతులు వంద శాతం రాయితీతో పొలం గట్లపై మొక్కలు పెంపకం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సన్నకారు రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాగాణి 2.50 ఎకరాలు లేదా మెట్ట 5 ఎకరాలు కలిగి ఉన్న సన్నకారు రైతులందరూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. మండలంలో మొత్తం150 ఎకరాలు ఉద్యాన పంటలు సాగుకు అవకాశం ఉందన్నారు. మునగ, నిమ్మ, దానిమ్మ, జామ తదితర పంటలు సాగు చేసుకునేందుకు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. హెచ్‌ఓ శారద, ఏపీఓ దయానంద్ పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఇద్దరి ఎంపిక




లక్ష్మీసాహితి , సాకేత్ కృష్ణ

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు శెట్టిపల్లి లక్ష్మీసాహితి, బత్తల సాకేత్ కృష్ణ జగనన్న ఆణిముత్యాలు పథకంలో నగదు బహుమతులకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జనార్దనరెడ్డి తెలిపారు. లక్ష్మీసాహితి 582 మార్కులు సాధించగా, సాకేత్ కృష్ణ 580 మార్కులు సాధించాడు. వీరికి రూ. 15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతిని 25వ తేదీన అధికారులు అందజేస్తారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

వేసవిలో పిల్లలను ఓ కంట కనిపెట్టండి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చిట్టమూరు: వేసవిలో పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టుకుని ఉండాలని ఎస్‌ఐ లక్ష్మీభవానీ సూచించారు. మండలంలోని అద్దెపూడి, జంగాలపల్లెలో శుక్రవారం చిట్టమూరు పోలీసులు విద్యార్థులు, తల్లిదండ్రులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు మధ్యాహ్న సమయంలో సేద తీరేందుకు తల్లిదండ్రులకు చెప్పకుండా చెరువులు, కాలువలు, వాగుల్లోకి ఈత కొట్టేందుకు వెళుతుంటారన్నారు. ప్రమాదవశాత్తు అనుకోని సంఘటనలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి పోతున్నారన్న విషయాన్ని గమనిస్తూ ఉండాలని సూచించారు. పోలీసు సిబ్బంది శంకరయ్య, విలేజ్ పోలీసు నవిత పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్

పెళ్లకూరు: గ్రామసభలతో క్షేత్రస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ రామయ్య అన్నారు. శుక్ర వారం ఆర్లపాడులోని 497.78 ఎకరాలకు సంబంధించి సర్వే బౌండరీ యాక్ట్ కింద జారీ చేసిన నోటీసులపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సాదా బైనామా, వారసత్వ అగ్రిమెంట్లుపై అర్జీలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అందువల్ల గ్రామస్తులు తమ అభ్యంతరాలను రెవెన్యూ అధికారులకు సమర్పించాలన్నారు. డీటీ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి రమాప్రభ, సర్వేయర్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని చుట్టి, బాలాయపల్లి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, శ్రేణులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పరిహారం చెల్లించాలి

నాయుడుపేటటౌన్: సాగరమాల రహదారి నిర్మాణానికి సంబంధించి రైతులు కోల్పోయిన భూములకు ముందుగా రైతులకు చెప్పిన మేరకు పరిహారం చెల్లించాలని పలువురు రైతులు శుక్రవారం కోరారు. నాయుడుపేటలో వారు విలేకరులతో మాట్లాడారు. సాగరమాల రహదారి నిర్మాణం కోసం మండలంలోని విన్నమాల, పెరికింలిపాటి కండ్రిగ తదితర గ్రామాలకు చెందిన రైతులు సుమారు 40 ఎకరాలు వరకు భూములను కోల్పోతున్నట్లు తెలిపారు. అయితే ముందుగా సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు తమకు ఎకరాకు రూ.27 లక్షలు నగదు ఇస్తామని చెప్పి, నేడు ఎకరాకు రూ.21 లక్షలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు.

రాయితీ పరికరం.. రెట్టింపు ఆదాయం

అన్నదాత ఆరుగాలం శ్రమిస్తూ.. పంట పండిస్తూ దేశానికి వెన్నెముకగా నిలుస్తున్నాడు. రైతన్న సుభిక్షంగా ఉంటేనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుంది. అందుకే వ్యవసాయంలో సమష్టి శక్తిని ప్రోత్సహించడం కోసం సీహెచ్‌సీ గ్రూపుల ఏర్పాటు.. బ్యాంకుల ద్వారా రుణ సాయం.. రాయితీతో యంత్ర పరికరాలు పంపిణీ.. ఫలితంగా కర్షకుడికి రెట్టింపు ఆదాయం చేకూరుతోంది.
సేద్యం సులువుగా మారుతోంది.

- యాంత్రీకరణతో వ్యవసాయం సులభం
- పరికరాల పంపిణీకి ప్రభుత్వం ప్రోత్సాహం
- బ్యాంకుల రుణ సదుపాయం



వేరుశనగ నూర్పిడి యంత్రం అందజేస్తున్న వ్యవసాయాధికారులు(ఫైల్)

చిల్లకూరు: ఒకప్పుడు సన్న, చిన్నకారు రైతులు భూస్వాముల వద్ద ఉన్న ట్రాక్టర్‌ను అద్దెకు తెచ్చుకునేందుకు రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. దొరకలేదంటే కాడి ఎద్దులతోనే దుక్కి దున్నుకుని పనులు చేపట్టాల్సి వచ్చేది. అయితే నేడు రైతుకు అలాంటి ఇబ్బంది లేకుండా రైతు గ్రూపు సభ్యుల నుంచి అవసరమైన సమయంలో యంత్రాలను అద్దెకు తీసుకుని, ఉపయోగించుకుంటున్నారు.

పరికరాల పంపిణీ ఇలా..

ఒక్కొక్క రైతు భరోసా కేంద్రంలో ఒక సీహెచ్‌సీ గ్రూపును ఏర్పాటు చేశారు. ఆ గ్రూపులకు 30 నుంచి 40 శాతం రాయితీతో రూ.15 లక్షల యంత్ర పరికరాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఐదుగురు సభ్యులుండే గ్రూపులో సభ్యులు రూ.1.50 లక్షలు డిపాజిట్ చేస్తే, బ్యాంకు ద్వారా రూ.7.5 లక్షల రుణం, ప్రభుత్వ రాయితీ కింద రూ.6 లక్షలు చెల్లిస్తారు. దీంతో మొత్తంగా రూ 15 లక్షలతో యంత్ర పరికరాలను కొనుగోలు చేయవచ్చు. వీటిని సొంత పనుల తోపాటు ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులకు తక్కువ మొత్తంలో అద్దెకు ఇచ్చి, తద్వారా వచ్చే ఆదాయంతో బ్యాంకులకు వాయిదా పద్ధతిలో బకాయిలు చెల్లించవచ్చు.

ఏఏ పరికరాలంటే..

రైతు గ్రూపులకు ట్రాక్టర్‌తో పాటుగా అందుకు అనుసంధానం చేసే కల్టివేటర్, బ్లేడ్‌లు, రోటావేటర్, లెవలింగ్ బ్లేడ్, పల్లమాను, డిస్కులు, ట్రక్కు, గట్లపై గడ్డి కోసే యంత్రం ఇలా ప్రతి వ్యవసాయ పరికరాన్ని అందిస్తుంది. అలాగే తైవాన్ స్ప్రేయర్లు, వేరుశనగ నూర్పిడి యంత్రాలు అందిస్తున్నారు. దీంతో కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	రైతు భరోసా కేంద్రాలు	సీహెచ్‌సీ గ్రూపులు
గూడూరు	17	17
చిల్లకూరు	18	18
కోట	16	16
వాకాడు	12	10
చిట్టమూరు	15	15

ఆర్బీకేలతో లాభం



రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటున్నారు. వారు రైతుల అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. అలాగే కేంద్రంలో ప్రభుత్వం అందించే రాయితీలను తెలియజేస్తున్నారు. ఇప్పుడు వ్యవసాయ పరికరాలను అందించడంతో రైతులకు వ్యవసాయం సులువుగా మారుతుంది.

- శ్రీనివాసులరెడ్డి, రైతు, బల్లవోలు

సేద్యం సులువైంది



ఆర్బీకేల ద్వారా రాయితీపై వ్యవసాయ పరికరాలను అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడంతో యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వ్యవసాయ పనులు ఎక్కువ శాతం కూలీల మీద ఆధారపడకుండా యంత్రాలతో సులువుగా సాగుతున్నాయి. దీంతో రైతులకు కొంత ఊరట లభిస్తుంది.

- నబీసాహెబ్, రైతు, అన్నంబాక

పరికరాల పంపిణీకి చర్యలు



ఆర్బీకేల ద్వారా రైతులకు సంబంధించి సీహెచ్‌సీ గ్రూపులు ఏర్పాటు చేస్తున్నాం. వారికి సకాలంలో ఎన్‌డీసీసీబీ ద్వారా రుణ సదుపాయం కల్పించి యంత్ర పరికరాలను అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాలలో గ్రూపులను ఏర్పాటు చేయడం పూర్తి చేశాం.

- గోపి నాయక్, ఏడీఏ, గూడూరు

మహిళా సాధికారతకు పెద్దపీట



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళ సాధికారతకు పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేటలో ప్రభుత్వ వైద్యశాల సమీపంలో రూ.5.13 కోట్ల వ్యయంతో జరుగుతున్న 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం సీహెచ్‌సీని సందర్శించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులను పరామర్శించారు. వైద్యులతో సమీక్ష సమావేశం జరిపారు.

మతి తప్పి మాట్లాడుతున్నారు!

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబుకు మతితప్పి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి అన్నారు. నాయుడుపేటలో నాయకులతో కలసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు ప్రజలే సరైన గుణ పాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, కటకం జయరామయ్య, చదలవాడ కమార్, పోట్లపూడి రాజేష్, గంథవల్లి సిద్ధయ్య, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, దారా రవి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ప్రాధాన్యం

సూళ్లూరుపేట రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలను తీర్చుదిద్దుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేటలోని ప్రభుత్వ వైద్యశాల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేటలో సీహెచ్‌సీని రూ.5.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

దారి మూసివేతపై ఫిర్యాదు

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి వారికి చెందిన స్థలంలోనికి వెళ్లేందుకు దారి లేకుండా చేస్తున్నారని తహసీల్దార్ శ్రీనివాసులకు ఈఓ శశాంక్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈఓ మాట్లాడుతూ గ్రామంలో ఆలయానికి సంబంధించిన 43 సెంట్లు భూమి ఉందన్నారు. అయితే ఈ స్థలంలోనికి వెళ్లేందుకు దారి లేకుండా ప్రైవేటు వ్యక్తులు తమకు పట్టా ఉందని కాంప్లెక్స్ కడుతున్నారన్నారు. దీంతో స్వామి వారి భూమి నిరుపయోగం అవుతుందన్నారు. అధికారులు సర్వే చేసి ఆలయ భూమికి దారి చూపాలని కోరారు.

కలెక్షన్ సెంటర్ పరిశీలన

సైదాపురం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి, డ్రిప్ ఇరిగేషన్ పీడీ శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం రైతులతో అధికారులు సమీక్షించారు. ఈ కలెక్షన్ సెంటర్‌ను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి కోరారు. వారివెంట పొదలకూరు ఉద్యానశాఖాధికారి ఆనంద్ ,సీసీ శ్యామల తదితరులున్నారు.

ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు

వాకాడు: మండలంలో ఇంటింటికీ ప్రభుత్వ పథకాలను చేరవేస్తున్న వలంటీర్లుకు ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది ఉత్తమ సేవా నగదు పురస్కారాలు అందిస్తోందని ఎంపీడీఓ గోపీనాథ్ తెలిపారు. శుక్ర వారం మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 246 మంది వలంటీర్లుగా పని చేస్తున్నారన్నారు. అందులో సేవా వజ్ర పురస్కారానికి జెమిన్ కొత్తపాళెం రౌతు కృష్ణవేణి, పూడిరాయిదొరువు కట్టి ప్రసాద్, సేవా రత్నా పురస్కారానికి మూలపడవ చిట్టిబాబు, నిడిగుర్తి మౌనిక, పూడిరాయిదొరువు రజిని, జెమిన్ కొత్తపాళెం బెనర్జీ, కల్లూరు సుజల శ్రీలక్ష్మి ఎంపికయ్యారన్నారు. మిగిలిన 239 మందిని సేవా మిత్ర పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు.



వలంటీర్లను సన్మానిస్తున్న అధికారులు, నేతలు

తడలో..

తడ: మండలంలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులు అందుకున్న వలంటీర్లను తడ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ కొళవి రఘురెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమోసుబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ గండవరం సురేష్ రెడ్డి, తడకండ్రిగ సర్పంచ్ జయప్రద, వైస్ ఎంపీపీలు వెంకటేష్, రమేష్, నాయకులు ఉచ్చూరు మునుస్వామిరెడ్డి, అహ్మద్ హుస్సేన్, చిన్నప్పన్, సుధాకర్, శశికుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మకు అంబళ్లు



అంబళ్లు పోస్తున్న భక్తులు

సూళ్లూరుపేట రూరల్: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో వచ్చే నెల తిరునాళ్ల నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులు పలు చోట్ల శుక్రవారం అంబళ్లు పోశారు. సూళ్లూరు, ఇందిరానగర్, జాన్సీనగర్, బజారు వీధుల్లో అమ్మవారి చిత్ర పటం ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు పుచ్చలపల్లి

వెంకటగిరి: దివంగత కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శనీయుడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం అన్నారు. పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి చెంగయ్య, ఏ మంజులమ్మ, ఐ భాస్కర్, సీహెచ్ సుబ్బరాయులు, రోజామణి, లీలావతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సేవలు చిరస్మరణీయం

నాయుడుపేటటౌన్: ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సేవలు చిరస్మరణీయమని సీపీఎం నాయకులు కొనియాడారు. పుచ్చలపల్ల వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు మహేష్ బాబు, ముకుంద, వెంకటేశ్వర్లు బీ గోపాల్, విజయమ్మ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సైదాపురం: అనంతమడుగు, చాగణం, సైదాపురం పాఠశాలల్లో నాడు-నేడు పనులను వేగవంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నాడు-నేడు పనులు నాణ్యతగా నిర్వహించాలన్నారు. జూన్ మొదటి వారం లోపు పూర్తి చేయాలన్నారు.

గల్లంతైన బాలుడి మృతి



శ్రీనివాసుల మృతదేహం

రాపూరు: మండలంలోని సిద్దవరం సమీపంలో ఉన్న తెలుగుగంగ కాలువలో గురువారం గల్లంతైన బాలుడు మృతి చెందినట్లు రాపూరు సీఐ కోటేశ్వరావు తెలిపారు. ఆయన కథనం.. నెల్లూ రు జిల్లా, పొదలకూరు మండలం, ఊట్లపాళెం గ్రామానికి చెందిన పలువురు గోవింద మాలవేసి 40 రోజులు పూర్తికావడంతో గురువారం పొదలకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 20 మంది ఇరుముడి కట్టి, కాలినడకన తిరుమలకు బయలుదేరారు. రాత్రి పూట రాపూరు అయ్యప్పస్వామి ఆలయంలో బస చేసి శుక్రవారం ఉదయం తిరిగి ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో సిద్దవరం సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఊట్లపాళేనికి చెందిన శ్రీనివాసులు(10) దిగి గంగకాలువలో పడిపోయాడు. రాత్రి 9 గంటల సమయంలో మాదవాయిపాళెం వద్ద శ్రీనివాసులు మృతదేహం లభ్యమైంది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్ష

కలువాయి: మండలంలోని మాదన్నగారిపల్లెలో ఈ నెల 24, 25 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో సచివాలయ అధికారులు, వలంటీర్లతో ఈఓపీఆర్డీ నారాయణ, జెడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల పూర్తి వివరాలకు సంబంధించిన రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ దండు నరసింహులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తి

గూడూరు: ప్రజలకు వలంటీర్లు అందజేస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. రెండో పట్టణంలోని మాళవ్యానగర్‌లోని సచివాలయంలో శుక్రవారం వలంటర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ వలంటీర్లు తక్కువ జీతాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వలంటీర్లు వేతనాల కోసం పనిచేయడం లేదని, వారు సేవా దృక్పథంతో పనిచేస్తున్నారన్నారు.

బాబు చేయలేనివి మేము చేస్తున్నాం

నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు హయాంలో చేయలేని పనులెన్నింటినో, నాలుగేళ్లలోనే తాము పూర్తి చేశామని, ఆ ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో డ్రైన్‌లు, కల్వర్టుల నిర్మాణ పనులు, ఒకటో వార్డులోని మరుగుదొడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే వరప్రసాద్ రావు కమిషనర్ సాయినాథ్‌తో కలసి శుక్రవారం పరిశీలించారు.

పేదలందరికీ భూ పంపిణీనే ప్రభుత్వ ధ్యేయం

అర్హత కలిగిన ప్రతి పేదవాడికి భూ పంపిణీ చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వరప్రసాద్‌రావు, బల్లి కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. భూ పంపిణీ విషయమై ఆర్డీఓ కిరణ్‌కుమార్‌తో కలసి, నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందితో వారు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు నరసయ్య, సుభాన్, రాజేష్ అల్తాఫ్, నాయకులు అన్నం మురళి, నరసయ్య, అజీజ్, భాస్కర్‌గౌడ్, బిక్కు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): ప్రతిపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు లబ్ధి చేకూర్చి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలంలోని రామాపురం, యాచవరం గ్రామాల్లో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. స్థానికుల నుండి సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వింటూ వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేస్తూ ముందుకు సాగారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, మండల కన్వీనర్ వెంకటసుబ్బయ్య, నాయకులు రమేష్ చౌదరి, దేవిక చౌదరి, మల్లెమాల గోపీకృష్ణారెడ్డి, వేళ్ల సురేంద్ర, కరణం రమేష్‌నాయుడు, రామతులసి, అల్లం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి



శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కోట: మండలకేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ కోరారు. శుక్రవారం కోటలో అండర్ డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ఆర్డీఓ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా కోటలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. తొలివిడతగా ప్రజల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు రోడ్డుకిరువైపులా ఆక్రమణలు తొలగించామన్నారు. డ్రైనేజీ కాలువల దుస్థితి చూసి, వెంటనే వాటికి మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. సచివాలయ, ఆర్బీకే భవనాలను వచ్చే నెల మొదటివారంలో ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం కోటలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, వాకాడు సీఐ హరికృష్ణ, ఎంపీడీఓ భవానీ, రఘురామిరెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

‘నోటీసులు లేకనే గ్రామసభ ఏమిటి?’



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, నేతలు

కలువాయి: మండలంలోని కోటూరుపల్లెలో రైతులకు నోటీసులు ఇవ్వకుండా రీ సర్వేపై రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించడం ఏమిటని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భూ రీసర్వేలో భాగంగా కలువాయి మండలం కోటూరుపల్లెలో అధికారులు సర్వే పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామసభ ఏర్పాటు చేశారు. పలువురు రైతులు తమకు ముందుగా నోటీసుల ఇవ్వకుండా సభ ఏర్పాటు చేశారని జెడ్పీటీసీ సభ్యుడి దృష్టికి తీసుకెళ్లారు. సర్వే తప్పుల తడకగా చేశారని, ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదని ఇది సరైన విధానం కాదన్నారు. రీసర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామ సభలో రీసర్వే డీటీ కామాక్షి, ఆర్ఐ విజయలక్ష్మి, మండల సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రను జయప్రదం చేద్దాం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధి

గూడూరు: పట్టణంలో జూన్ 24వ తేదీన, జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించనున్నామని, ఈ యాత్రలో భక్తులు పాల్గొని, స్వామివారి ఆశీస్సులు పొంది, జయప్రదం చేయాలని ఇస్కాన్ ప్రతినిధి సుఖదేవ్ స్వామి కోరారు. సొసైటీ కాలనీలోని ఇస్కాన్ కార్యాలయంలో శుక్రవారం జగన్నధ రథయాత్ర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో గూడూరు సొసైటీ కాలనీలోని శ్రీ నారాయణమ్మ దేవాలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల్లోని ఇస్కాన్ ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో బలభద్ర గోపదాస్, కట్టా మురళీకృష్ణ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేటలో‘మేరాలైఫ్- స్వచ్ఛ షెహార్’

నాయుడుపేటటౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మున్సిపాలిటీలో మేరాలైఫ్- స్వచ్ఛ షెహార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. రెడ్యూస్, రీ యూస్, రీ సైకిల్ (త్రిబుల్ ఆర్)విధానం ద్వారకా పనికిరాని వస్తువులను సేకరించనున్నట్లు చెప్పారు. ఇళ్లలో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఆదివారం నుంచి 1 నుంచి 12 వార్డుల వరకు స్వర్ణముఖి నది హిందు శ్మశాన వాటిక సమీపంలో ఉన్న మున్సిపల్ గ్యారేజీ వద్ద, 13 నుంచి 25 వార్డుల ప్రజలు పాత ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో ఉన్న మున్సిపల్ గ్యారేజి వద్ద సేకరించడం జరుగుతుందన్నారు.